## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 42 మందికి జైలు

సిరిసిల్ల గాంధీచౌక్, జనవరి 8: డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన కేసులో 42 మందికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సిరిసిల్ల ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ప్రవీణ్ సోమవారం తీర్పునిచ్చారు. డిసెంబర్ 31న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో వీరు పట్టుబడ్డారు. ఇందులో 18 మందికి ఒక్క రోజు జైలు శిక్ష, రూ. 3 వేల చొప్పున జరిమానా ఐదుగురికి రెండురోజుల జైలు రూ. 3 వేల చొప్పున జరిమానా, 19 మందికి రూ. 3 వేల చొప్పున జరిమానా విధించారు.

## నేడు కరీంనగర్‌లో ఉద్యోగ మేళా

కమాన్ చౌరస్తా, జనవరి 8 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా నిరుద్యోగ యువత కోసం మంగళవారం కరీంనగర్ ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పనాధికారి దేవేందర్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ మేళా ప్రారంభమవుతుందని, కరీంనగర్‌తోపాటు ఇతర జిల్లాల్లో యాక్సిస్ బ్యాంక్, నవతా ట్రాన్స్‌పోర్టులో, టెలీమార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఫార్మసిస్ట్, క్లర్క్, తదితర ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. పది, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీఫార్మసీ విద్యార్హత ఉన్న అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 72076 59969 నంబరులో సంప్రదించాలని చెప్పారు.



చిన్నారి హర్షితకు చిరుకానుకను అందిస్తున్న కేటీఆర్

## బీఆర్ఎస్ నేత కూతురికి కేటీఆర్ బర్త్‌డే గిఫ్ట్

- హైదరాబాద్ పిలిపించుకొని బర్త్‌డే శుభాకాంక్షలు
- చిరుకానుక అందజేత
- బాగా చదుకోవాలని సూచించిన వర్కింగ్ ప్రెసిడెంట్

సిరిసిల్ల రూరల్, జనవరి 8: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుగ్గిల్ల సంజీవ్‌గౌడ్ కూతురు హర్షితకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఆశీర్వాదం అందించారు. ఏడో తరగతి చదువుతున్న హర్షితకు కేటీఆర్ అంటే ఎంతో అభిమానం కాగా, జనవరి 7న ఆమె పుట్టిన రోజును పురస్కరించుకొని తండ్రి సంజీవ్ కేటీఆర్‌కు మెస్సేజ్ చేశారు. స్పందించిన కేటీఆర్ హర్షితకు బర్త్‌డే విషెస్ తెలిపారు. ఈ క్రమంలో 'సర్ మా పాపకు మీరంటే ఎంతో అభిమానం. మీ ఆశీర్వాదం తీసుకోవాలనుకుంటోంది' అని సంజీవ్ మళ్లీ మెస్సేజ్ చేయగా, చిన్నారిని తీసుకొని హైదరాబాద్ రావాలని సూచించారు. సోమవారం సంజీవ్ తన కూతురుతో కలిసి తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. హర్షితను ఆశీర్వదించిన కేటీఆర్, ధాన్యం బస్తాలతో కూడిన ఎడ్ల బండిని చిరు కానుకను అందించి, బాగా చదువుకోవాలని సూచించారు. చిరుకానుకతో సంబురపడ్డ హర్షిత కేటీఆర్‌కు థ్యాంక్స్ చెప్పింది.




కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్‌కు అందజేసే వినతిపత్రాలను చూపుతున్న దళితబంధు లబ్ధిదారులు

# దళితబంధు రెండో విడుత ఇవ్వండి

- డిమాండ్ చేసిన హుజూరాబాద్ నియోజకవర్గ దళితబిడ్డలు
- పెద్దసంఖ్యలో కరీంనగర్ ప్రజావాణికి రాక
- వెంటనే నిధులు జమ చేయాలని డిమాండ్
- లేకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరిక
- జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ మద్దతు

**దళితబంధు రెండో విడుత నిధుల కోసం దళితలోకం ఎదురుచూస్తున్నది. గత కేసీఆర్ సర్కారు సాయం అందించే ప్రక్రియ చేపట్టినా.. ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయింది. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నెల గడుస్తున్నా.. ఎలాంటి స్పష్టత లేక ఆందోళన వ్యక్తమవుతున్నది. పథకం అమలులో జాప్యాన్ని నిరసిస్తూ ఇప్పటికే హైదరాబాద్ ప్రజాదర్బార్‌లో దరఖాస్తులు సమర్పించారు. అయినా పరిష్కారం కాకపోవడంతో పైలెట్ ప్రాజెక్టు హుజూరాబాద్ నియోజకవర్గంలోని లబ్ధిదారులు సోమవారం కరీంనగర్ ప్రజావాణికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తమకు రెండో విడుత నిధులు ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలంటూ నిలదీశారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలని, లేకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు.**

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 8 : దళితబంధు రెండో విడుత నిధులు వెంటనే జమచేయాలని హుజూరాబాద్ నియోజకవర్గ దళితబిడ్డలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెల రోజులవుతున్నా ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తూ.. సోమవారం వంద మందికిపైగా కరీంనగర్ కలెక్టర్‌లోని ప్రజావాణికి తరలివచ్చారు. రెండో విడుత నిధులు వెంటనే ఇవ్వాలని కలెక్టర్ పమేలా సత్పతికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. తమ ఖాతాల్లో ఇదివరకే నిధు లు జమైనా విడిపించుకోకుండా అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారంటూ ఫిర్యాదు చేశా రు. నెలల తరబడి తిరుగుతున్నా, పట్టించుకోవడం లేదని విమర్శించారు. తమకు తక్షణమే సమాధానం చెప్పాలని, లేదంటే ఆందోళనకు దిగుతామనడంతో ఉన్నతాధికారులు వద్దని వారించారు. ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రాగానే నిధులు విడుదల చేస్తామని వారు స్పష్టం చేయగా, పాత లబ్ధిదారులకు కొత్త గైడ్‌లైన్స్ ఎందుకనే సంశయం వ్యక్తం చేస్తూ, బయటకు వచ్చారు. తర్వాత కూడా కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. నిర్దిష్ట గడువులోగా తమకు మంజూరైన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవం క మండలాల నుంచి దళితబంధు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో వచ్చిన విషయం తెలియడంతో కరీంనగర్ జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ వెంటనే అక్కడకు చేరుకొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ, అధికారుల నిర్లక్ష్యం వల్లే పైలెట్ ప్రాజెక్టు హుజూరాబాద్ నియోజకవర్గంలో సుమారు ఎనిమిదివేల మంది లబ్ధిదారులకు ఇప్పటికీ రెండో విడుత నిధులు విడుదల కాలేదని మండిపడ్డారు. లబ్ధిదారుల ఖాతాల్లో ఉన్న ₹5లక్షలు కూడా ఫ్రీజ్ చేయడంతో ఆందోళన నెలకొన్నదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.



దళితబంధు లబ్ధిదారులతో జడ్పీ చైర్‌పర్సన్ కనమల్ల విజయ



### అధికారుల వైఖరితోనే..

దళితులను ధనవంతులను చేసేందుకు అప్పటి సీఎం కేసీఆర్ సారు దళితబంధు తెచ్చిండు. మాలాంటి పేదోళ్లను ఎంపిక చేసిండు. అయితే, అధికారులు మాత్రం మాపై వివక్ష చూపుతున్రు. రెండో విడత ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్రు. ఈడీ అసలు పట్టించుకోవడం లేదు. 45 రోజులు సెలవులో వెళ్లి, ఎన్నికల్లో వచ్చిండు. అప్పుడు ఎన్నికల కోడ్ ఉందన్నడు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం నుంచి అనుమతి రావాలంటున్నడు. అప్పులు తెచ్చి వ్యాపారం అభివృద్ధి చేసిన. రెండో విడత డబ్బులు రాగానే అప్పులు తీరుద్దామనుకుంటే అధికారులు ఇట్లా చేస్తున్నరు. వెంటనే ప్రభుత్వం స్పందించాలి. మా ఖాతాల్లో నిధులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలి.

**- అక్కనపల్లి జయ, దళితబంధు లబ్ధిదారులు (కనగర్తి)**



### అధికారులపై చర్యలు తీసుకోవాలి

దళితుల ఆర్థిక ఎదుగుదల కోసం కేసీఆర్ సారు దళితబంధు తెచ్చిండు. కానీ, కొంతమంది అధికారులే నీరుగారుస్తున్నరు. దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా వాటిని పరిశీలించడం లేదు. మొదటి విడుతగా విడుదలైన నిధులతో వ్యాపారాలు ఏర్పాటు చేసుకున్నం. విస్తరించుకున్నం. అయినా రెండో విడుత ఇవ్వాల్సిన మిగతా మొత్తం మా ఖాతాల్లో జమచేస్తలేరు. అధికారులనడిగితే రేపు, మాపు అంటూ సాగదీసిన్రు. తర్వాత ఈడీ సెలవులో ఉన్నడని, ఎన్నికల కోడ్ వచ్చిందని మభ్యపెట్టిన్రు. కొత్త ప్రభుత్వం వచ్చి దళితబంధు నిధులు హోల్డ్‌లో పెట్టింది. దీంతో నిధులు విడుదల అవుతాయా..? లేదా..? అని ఆందోళన చెందుతున్నం. దీనంతటికీ కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి. వెంటనే రెండో విడత నిధులు మా ఖాతాల్లో జమచేయాలి.

**- చల్ల గీత, లబ్ధిదారురాలు (జమ్మికుంట)**



### ప్రభుత్వ నిర్ణయం మాకు శాపంగా మారద్దు

కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం హుజూరాబాద్ నియోజకవర్గంలోని దళితులకు శాపంగా మారద్దు. సమాజంలో అణగారిన వర్గాలుగా ఉన్న మాకు వ్యాపారావకాశాలు కల్పించి, ఆర్థికంగా ఎదిగేందుకు సహకరించిన దళితబంధును కొనసాగించాలి. పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ పథకంలో మాకు కేవలం మొదటి విడత మాత్రమే డబ్బులు విడుదల చేసిన్రు. ఎన్నికల అనంతరం రెండో విడత ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు చెప్పిన్రు. కానీ, ఇప్పటి వరకు చేయలేదు. అధికారుల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోయినం. నిర్లక్ష్యంలో ఈడీ పాత్ర కూడా ఉన్నది. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

**- వడ్డెపల్లి శ్రీనివాస్, దళితబంధు లబ్ధిదారుడు, రెడ్డిపల్లి (వీణవంక మండలం)**

## దళితులకు అండగా ఉండాలి

- రెండో విడుత నిధులు వెంటనే విడుదల చేయాలి
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ డిమాండ్

హుజూరాబాద్ టౌన్, జనవరి 8: దళిత కుటుంబాల్లో వెలుగులు నింపిన దళితబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించి అండగా ఉండాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. రెండో విడుత డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఒకప్పుడు ₹లక్ష రూపాయల రుణం కావాలంటే ఆస్తులు తనఖా పెట్టాలంటూ సవాలక్ష కొర్రీలు పెట్టేవారని, అయినా బ్యాంకుల్లో రూపాయి దొరకని పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. దళితులు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 'దళితబంధు' పథకం తెచ్చారని, ఎంతో మంది దళితుల జీవితాలను అద్భుతంగా మార్చారని కొనియాడారు. బ్యాంకులతో సంబంధం లేకుండా, తిరిగి చెల్లించే అవసరం లేకుండా ₹10 లక్షల ఆర్థిక సహాయం చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని ప్రశంసించారు. దళితుల జీవితాలను మార్చిన దళితబంధు పథకాన్ని కొనసాగించాలని కోరారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు పడి ఉన్నాయని, పెండింగ్‌లో ఉన్నవాటిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

## సమ్మక్క జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

కమాన్‌చౌరస్తా, జనవరి 8: ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు జరుగనున్న సమ్మక్క సారలమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. కరీంనగర్ జిల్లాలో రేకుర్తి, కేశవపట్నం, హుజూరాబాద్‌లో జరిగే జాతరకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకానున్నందున పక్కా ప్రణాళికతో పనులు చేపట్టాలని సూచించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో జాతర ఏర్పాట్లపై సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతర ప్రాంతాల్లో తాగునీరు, టాయిలెట్, శానిటేషన్ తదితర సౌకర్యాలు కల్పించాని, క్యూలైన్ల కోసం బారికేడ్లు ఏర్పాటు చేయాలని, వేడుకల టైంలో కెనాల్‌లో స్నానాల కోసం నీటిని విడుదల చేయాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, జిల్లా ఆబ్కారి శాఖ అధికారి శ్రీనివాసరావు, మిషన్ భగీరథ సీఈ అమరేందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామ్‌కుమార్, అగ్నిమాపక శాఖ అధికారి వెంకన్న, డీఎంఅండ్‌హెచ్‌వో లలితాదేవి పాల్గొన్నారు.



ఆలయ ఆవరణలో భక్తులు

## వేములవాడకు 50వేలకు పైగా..

వేములవాడ టౌన్, జనవరి 8: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం సోమవారం భక్తజన సంద్రమైంది. సమ్మక్క-సారలమ్మ జాతరకు ముందే రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో భక్తులు వేకువజాము నుంచే పవిత్ర ధర్మగుండంలో స్నానాలు ఆచరించి, తలనీలాలు సమర్పించారు. బెల్లాన్ని పంచిపెట్టి, రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. సుమారు 50వేలకు పైగా భక్తులు రాజన్నను దర్శించుకున్నారని అధికారులు తెలిపారు.


మరిన్ని జిల్లా వార్తలు 8లో..


# వైద్య సేవలకు జాతీయ గుర్తింపు



ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ అందుకున్న తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- సిరిసిల్లలోని హెల్త్ సెంటర్ల నిర్వహణకు కేంద్రం ప్రశంసలు
- ఇటీవలే ఏడు కేంద్రాలకు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్
- ఒక్కో సెంటర్‌కు ₹9లక్షల ప్రోత్సాహకం
- మరో రెండు కేంద్రాల ఎంపికకు కసరత్తు
- వైద్యాధికారులు, సిబ్బంది హర్షం

**మన వైద్యానికి జాతీయ గుర్తింపు లభించింది. వైద్యాధికారులు, సిబ్బంది కృషికి ఫలితం దక్కింది. జిల్లాలో దవాఖానల నిర్వహణ, నాణ్యతాప్రమాణాలు, రోగులకు మెరుగైన చికిత్సకు గాను ఏడు ఆరోగ్య కేంద్రాలకు ఇటీవలే ఎన్‌క్వాస్ సర్టిఫికెట్లు అందజేసిన కేంద్రం, తాజాగా మరో రెండు కేంద్రాలు ఎంపికయ్యే అవకాశమున్నదని యంత్రాంగం చెబుతున్నది.**

రాజన్న సిరిసిల్ల, జనవరి 8 (నమస్తే తెలంగాణ): దవాఖానల్లో వైద్య సేవలే కాకుండా మౌలిక సౌకర్యాలుంటేనే ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ గుర్తింపు వచ్చే చాన్స్ ఉండగా, గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు జిల్లా ఏరియా దవాఖానల్లో ఖరీదైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ క్రమంలో నేషనల్ హెల్త్ సిస్టమ్ రిసోర్స్ సెంటర్ (ఎన్‌హెచ్ఎస్ఆర్సీ) నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను చేరుకున్నందుకుగాను ఇటీవలే జిల్లాలో కోనరావుపేట, బోయినపల్లి, విలాసాగర్, తంగళ్లపల్లి, నేరెళ్ల, కొదురుపాక, సిరిసిల్ల అర్బన్‌లో పీఎస్‌నగర్ ఆరోగ్య కేంద్రాలు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్‌కు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్లను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు ఇటీవలే అందించింది. అయితే సర్టిఫికెట్‌తో ఒక్కో సెంటర్‌కు ఏడాదికి ₹3లక్షల చొప్పున మూడేళ్లపాటు ₹9లక్షల ప్రోత్సాహక నిధులు రానున్నాయి. ఈ నిధులతో ఆయా దవాఖానల్లో మరిన్ని వసతులు సమకూర్చుకునే అవకాశం రాగా, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే గంభీరావుపేట మండలం లింగన్నపేట, వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట పీహెచ్‌సీలకు కేంద్రం సర్టిఫికెట్ ఇచ్చే అవకాశం ఉన్నదని, ఈ మేరకు సంకేతాలు అందినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.



ఆరోగ్య కేంద్రంలో అధునాతన సౌకర్యాలు



### కలెక్టర్ సంపూర్ణ సహకారం వల్లే..

మెరుగైన వైద్యం, నాణ్యతా ప్రమాణాల్లో జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలు అగ్రస్థానంలో నిలిచాయి. కలెక్టర్ అనురాగ్ జయంతి సంపూర్ణ సహకారం వల్లే ఏడు సెంటర్లకు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్లు వచ్చాయి. అంతేకాదు ఒక్కో సెంటర్‌కు ₹9 లక్షల ప్రోత్సాహక నిధులు రానుండగా, వాటితో మరిన్ని వసతులు కల్పించుకోవచ్చు. అయితే కొత్తగా గంభీరావుపేట మండలం లింగన్నపేట, వేములవాడ రూరల్ మండలం హన్మాజీ పేట పీహెచ్‌సీలకు సర్టిఫికెట్ వచ్చే అవకాశం కనిపిస్తున్నది. **- డాక్టర్ సుమన్ మోహన్‌రావు, డీఎంహెచ్‌వో (రాజన్న సిరిసిల్ల)**

# బండి సంజయ్ చేసేందేమీ లేదు

- ఐదేండ్లలో ఐదు కొత్తలు కూడా తేలే
- నేను ఎంపీగా ఉన్నప్పుడే కరీంనగర్‌కు రైల్వే ప్రాజెక్టు తెచ్చిన
- స్మార్ట్ సిటీ కోసం కోట్లాడి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయించిన
- కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు నెరవేర్చాలి
- కార్యకర్తలు అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం
- పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగురాలి
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్

కొడిమ్యాల, జనవరి 8: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఈ ఐదేండ్ల కాలంలో చేసిందేమీ లేదని, కేంద్రం నుంచి ఐదు కొత్తలు కూడా తీసుకురాలేదని మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ విమర్శించారు. కనీసం రైల్వే ప్రాజెక్టులు, నవోదయ విద్యాలయాలు కూడా తేలేదని మండిపడ్డారు. కానీ, తాను 2014లో ఎంపీగా ఉన్నప్పుడే కరీంనగర్‌కు రైల్వే ప్రాజెక్టు తెచ్చానని, కరీంనగర్ స్మార్ట్ సిటీ కోసం కోట్లాడి ₹వెయ్యి కోట్లు మంజూరు చేయించానని గుర్తు చేశారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, కార్యకర్తలు కుంగిపోవద్దని సూచించారు. శ్రేణులకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి వస్తారని, అందరికి మంచి రోజులు వస్తాయని హర్షం వ్యక్తం చేశారు. కొడిమ్యాల మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడక ముందు నీళ్లు, కరెంట్ కోసం రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని, వ్యవసాయమే ఆగమైపోయిందన్నారు. ఎందరో ఆత్మహత్య చేసుకున్నారన్నారు. తెలంగాణ వస్తే కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సి ఉంటుందని అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హేళనగా మాట్లాడారని గుర్తు చేశారు. కానీ రాష్ట్రం ఏర్పడగానే 7778 మెగావాట్లు ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 26వేల మెగావాట్లకు పెంచిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని కొనియాడారు. నీళ్లు, నిధులు నియామకాల కోసం రాష్ట్రాన్ని సాధించుకున్నామని, ఈ క్రమంలోనే కాళేశ్వరం సహా అనేక ప్రాజెక్టులు నిర్మించుకుని సాగుకు పుష్కలంగా నీరందించామని చెప్పా రు. ఇంకా పవర్ ప్రాజెక్టులు నిర్మించి రైతులకు 24 గంటల కరెంట్ ఇచ్చామని, రాష్ట్రంలోని 1.61 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి యువత కలలు సాకారం చేసినట్లు వివరించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలన్నీ వంద రోజుల్లో అమలు చేయకుంటే ఎక్కడికక్కడ ఎండగడుతామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఈ యేడాది డిసెంబర్‌కల్లా రాష్ట్రం లో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశా రు. ఎన్నికలకు వారం రోజుల ముందే రైతు బంధు కోసం ₹7700 కోట్ల నిధులను సమాకుర్చిపెడితే ఇప్పటివరకు డబ్బులు రైతు ఖాతాల్లో ఎందుకు జమ చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు తెలంగాణను బంగారు పల్లెంలో పెట్టి అప్పగించామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కేసీఆర్ సర్కా రు చేసిన అభివృద్ధి, ఇంటింటికీ అందించిన సంక్షేమ ఫలాలను వివరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పులి వెంకటేశంగౌడ్. ఎంపీపీ మేన్నేని స్వర్ణలత, కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ మేన్నేని రాజనర్సింగరావు, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యులు ఉట్కూరి మల్లారెడ్డి, చీకట్ల సింధు, సామల్ల లక్ష్మణ్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు నసిరుద్దీన్, సర్పంచులు భూక్య బోజ్జ నాయక్, మల్యాల మహిపాల్, ఏగుర్ల తిరుపతి, గరిగంటి మల్లేశం, నాయకులు అంకం రాజేశం, బండపెల్లి అంజన్‌కుమార్, నాగి శేఖర్, కొత్తూరి స్వామి, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఉన్నారు.